క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన

పెద్దవంగర: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్బందీగా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కృష్ణ కిశోర్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఎస్సై క్రాంతికిరణ్‌తో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రం వద్ద సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తొర్రూరు సీఐ గణేష్, ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి

తొర్రూరు: ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంచేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషా ఖాన్ అన్నారు. వార్షిక పర్యవేక్షణలో డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోను ఈడీ తనిఖీ చేశారు. ఆర్ఎం విజయభానుతో కలిసి రికార్డులు తనిఖీ చేయడంతోపాటు ఆయా విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎం పద్మావతి, కరీంనగర్ జోన్ సీఐ బోయేజ్‌కుమార్, ఎస్‌టీఐ రజితారెడ్డి, ఎంఎఫ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి

గార్ల: బీజేపీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ సోమవారం గార్లలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జంపాల శ్రీను, వీర్యానాయక్, నేలం నాగేంద్రబాబు పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతతో ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, పలు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రచారం నిర్వహించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘురెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో ఏలే చంద్రమోహన్..

డోర్నకల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి ఏలే చంద్రమోహన్ కోరారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పశు వైద్యశిబిరం

గార్ల: పశువులకు కృత్రిమ గర్భధారణ ద్వారా ఆవులు, గేదెలకు 90శాతం మేలుజాతి ఆడ దూడలు జన్మిస్తాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బోడెపూడి కిరణ్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పుల్లూరు గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గార్ల, డోర్నకల్, ముల్కనూరు పశువైద్యులు సురేష్‌కుమార్, నాగేశ్వరరావు, శ్రవణ్‌కుమార్, పశువైద్య సిబ్బంది శేఖర్, చందులాల్, గోపాలమిత్రలు రవి, సంజీవ్, నగేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కురవి: రైతులు పండించిన మిర్చి పంటకు కనీస మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



నెల్లికుదురు: మండలంలోని జామతండా గౌట్ డీఎన్‌టీ పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.అనోషా, ఉపాధ్యాయుడు సీహెచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న రైతులు



నర్సింహులపేట పశువైద్యశాల భవనం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న నూతన భవనం మంజూరుకు మోక్షం కలగడం లేదు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణం వెనుక భాగంలో 2018 సంవత్సరంలో పశువైద్యశాల నూతన భవన నిర్మాణం కోసం సుమారుగా రూ.20లక్షలతో అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కోవిడ్ రావడంతో మంజూరు కాలేదని ప్రచారం జరిగింది. నర్సింహులపేట పశువైద్యశాల పరిధిలో కొమ్ములవంచ, బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, ముంగిమడుగు, పడమటిగూడెం, శివారు తండాలు ఎక్కువగా ఉన్నాయి. మండల పరిధిలో యాదవులు, రైతులు ఎక్కువగా ఉన్నారు. పశువైద్యశాల భవనం ఎప్పుడు కూలుతుందో తెలియక అధికారులు దానిని వదిలేసి పక్కనే ఉన్న పాత జీపీలో విధులను కొనసాగిస్తున్నారు. పలుసార్లు జిల్లా అధికారులకు, అగ్ర నాయకులకు పశువైద్యశాల మంజూరు కోసం విన్నవించిన ఫలితం శూన్యంగానే ఉంది. సంవత్సరాలు గడుస్తున్న పశువైద్యశాల భవనం మంజూరు కాకపోవడంపై అధికారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో నూతన పశువైద్యశాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ కవిత

మహబూబాబాద్/దంతాలపల్లి/మరిపెడ: జిల్లాలో సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు దంతాలపల్లి, మహబూబాబాద్, మరిపెడలో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ కవిత మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ విగ్రహాలు, అమర వీరులస్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాగా దంతాలపల్లి మండలంలోని రామానుజాపురం గ్రామంలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఓ వ్యక్తికి రూ.1.50లక్షల ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. అలాగే జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నలమాస సాయి ఆధ్వర్యంలో తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000కోట్ల బడ్జెట్ కేటాయించే విషయంలో కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న తన పీఏ రాజేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత గిరిజన సంప్రదాయ దుస్తులతో ఎమ్మెల్సీ కవితను సన్మానించారు.

తెగల్లో వర్గీకరణ జరగాల్సిందే..

- తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య



అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

గూడూరు: షెడ్యూల్డ్ తెగల్లో రిజర్వేషన్ వర్గీకరణ జరిగినప్పుడు మాత్రమే ఆదివాసీలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాలలో న్యాయం జరుగుతుందని తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి హాల్‌లో సోమవారం నిర్వహించిన ఆదివాసీ మహిళా సంఘం జిల్లా సదస్సు రాష్ట్ర అధ్యక్షురాలు మైపతి వీణారాణి, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ తెగల్లో రిజర్వేషన్ వర్గీకరణ జరగకపోతే తుడుం దెబ్బ పవర్ చూపిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ మహిళా జిల్లా కమిటీ ఎంపిక చేసి ప్రకటించారు. అధ్యక్షురాలిగా ప్రమీల, ప్రధాన కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలిగా గౌతమి, కుమారి, కార్యదర్శులుగా కొమ్మక్క, సుగుణ, కృష్ణవేణి, పద్మలను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోర్నకల్: డోర్నకల్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మహబూబాబాద్ నుంచి డోర్నకల్ వస్తున్న కారు ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ పక్కన అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న డోర్నకల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నకు తీవ్రగాయాలు కాగా కాంగ్రెస్ నాయకులు ఎర్రబోయిన శ్రీనివాస్, సీపీఎం నాయకులు జె.వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108వాహనంలో డోర్నకల్ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బీసీలందరూ ఏకం కావాలి



మేనిఫెస్టో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

బయ్యారం: సంఖ్యాపరంగా ఎక్కువశాతం ఉన్న బీసీలకు రాజకీయపరంగా అవకాశాలు ఇవ్వటం లేదని, బీసీలందరూ ఏకమై బీసీలకే ఓటు వేయాల్సిన అవసరం ఉందని బీసీ ఉద్యమకారుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సామాజిక ఉద్యమకారులు సాంబశివరావు జయంతి వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బీసీలు సగం.. బీసీల వాటా సగం శీర్షికన రచించిన బీసీ మేనిఫెస్టో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఏ ఎన్నికలైన పోటీలో నిలబడిన బీసీలకే ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మద్దినేని గుట్టయ్య, మాజీ ఉపసర్పంచ్ కత్తి రమేష్, తెలంగాణ బీసీ సంక్షేమ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్త వినయ్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు భిక్షపతి, నాయకులు సురేష్‌కుమార్‌గౌడ్, ఉదయ్, రామనర్సయ్య, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రింటర్స్ డే వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

నెహ్రూసెంటర్: ప్రపంచ ప్రింటర్స్ డేను పురస్కరించుకుని మహబూబాబాద్ ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలం రాజు, నక్క నాగార్జున మాట్లాడుతూ.. అక్షరానికి ముద్రణ రూపంలో ప్రాణంపోసి సమస్త మానవాళికి ముద్రణ ద్వారా విద్యను మరింత దగ్గర చేసిన మహనీయుడు సర్ జోహన్నస్ గూటన్‌బర్గ్ అని కొనియాడారు. ప్రింటర్స్ డే సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్‌లాకవత్, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, ప్రింటర్స్ వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి జంగాల వెంకటేష్, ఎడ్ల ఉప్పలయ్య, కన్న అశోక్‌బాబు, అనుముల శ్రీనివాసచారి, రంగు సురేష్, బల్లెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ వాటర్‌మన్ మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీలో వాటర్‌మన్ విధులు నిర్వహిస్తున్న కార్మికుడు వాంకుడోత్ లచ్చిరాంనాయక్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్.ఉపేందర్ సోమవారం లచ్చిరాం నాయక్ మృతదేహాన్ని సందర్శించి దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

జేబు దొంగల హల్‌చల్

కేసముద్రం: సందెట్లో సడేమియా అన్నట్లుగా.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటనలో భాగంగా సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో కొందరు దొంగలు నాయకుల జేబులో నుంచి సెల్ ఫోన్, డబ్బులను అపహరించారు. రూ.50వేలకు పైగా చోరీ చేశారు.

న్యాయవాదుల పాత్ర కీలకం



పుస్తకాలు అందజేస్తున్న విశ్వ జంపాల

మహబూబాబాద్ రూరల్: చట్టాల అమలులో న్యాయవాదుల పాత్ర కీలకమని ప్రముఖ న్యాయవాది, విశ్వసమాజం వ్యవస్థాపకుడు విశ్వ జంపాల అన్నారు. పాత, కొత్త క్రిమినల్ మేజర్ చట్టాల టేబుళ్లతో ఉన్న ఏఎల్టీ పబ్లికేషన్ పుస్తకాలను న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మామిడాల సత్యనారాయణ, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాస్, న్యాయవాదులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, భూక్య మోహన్ నాయక్, నీరుటి రాజమణి, సూర్యపాక హరిబాబు, తోనకనూరి సైదులు, విజయ పాల్గొన్నారు.

వేసవిలో నిరంతరం విద్యుత్

పెద్దవంగర: వేసవిలో నిరంతరం విద్యుత్ అందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టుతున్నట్లు ఏఈ రమేష్ బాబు తెలిపారు. సోమవారం బొమ్మకల్లు, ఉప్పరగూడెం, అవుతాపురం, రాజ్‌మాన్‌సింగ్ తండా గ్రామ పంచాయతీలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

బయ్యారం: మండల కేంద్రం నుంచి చోక్లాతండా వట్టేరు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ.. రహదారిపై కంకరపోసి వదిలేయడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, యాకన్న, వీరభద్రం, రాకేష్, భిక్షం, మురళి, వీరభద్రం, సోమక్క, రమేష్, భద్రు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న నాగయ్య

నెహ్రూసెంటర్: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు గుర్తింపు కార్డులు, 57 సంవత్సరాలు నిండిన కార్మికులకు పింఛన్, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉపాధి పని దినాలను 200లకు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, ఎండీ.యాకుబ్, బాణాల రాజన్న, చేపూరి గణేష్, గొడిశాల వెంకన్న, ఉప్పనపల్లి శ్రీనివాస్, మధుసూదన్, చింతల భిక్షపతి, జక్కుల లింగన్న, బ్రాహ్మాచారి, పులి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలి



అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27 జరగనున్న క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు కోరారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాహనాల పార్కింగ్ నిలిపివేత

కురవి: మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా వీరభద్రస్వామి కల్యాణం సందర్భంగా ఖమ్మం వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌ను జెడ్పీ హైస్కూల్‌లో నిలిపివేసినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఉండడం, శివరాత్రి సందర్భంగా పార్కింగ్ పాఠశాల ఆవరణలో ఉండదని తెలిపారు. ఖమ్మం వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, భక్తులు గుర్తుంచుకోవాలని సూచించారు.

పట్టపగలు చోరీ

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో సోమవారం పట్టపగలు ఇంట్లో ఎవరు లేని సమయంలో మెరుగు నర్సయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తలుపుల తాళాలు పగలగొట్టి ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. సుమారుగా రూ.28 వేల నగదు, తులం బంగారం, 50 తులాల వెండి అపహరించినట్లు సమాచారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు స్వాహా చేశాడని ఆందోళన

నర్సింహులపేట: మండలంలోని గోల్‌బోడ్కతండాలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి నిధులు స్వాహా చేశాడని, ఉపాధి హామీలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదని డిమాండ్ చేస్తు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట గ్రామస్తులు అందోళన చేశారు. నిధులు స్వాహా చేసిన వ్యక్తిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని ఎంపీడీఓ యాకయ్యకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరోజతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్: వచ్చే నెల 2న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ ప్రాంతంలో నిర్వహించే యుద్ధభేరి కార్యక్రమంను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముబీన్ అహ్మద్ మాట్లాడుతూ.. సీపీఎస్, యూపీఎస్ విధానాలతో ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సన్మానం..

మహబూబాబాద్ రూరల్: జిల్లా మహిళా కాంగ్రెస్ (డీడబ్ల్యూసీ) అధ్యక్షురాలు నూనావత్ రాధను ఏఐసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నారీ న్యాయ సమ్మేళన్ నిర్వహించారు.

రాజ్యాంగ ఉనికికే ప్రమాదం

గూడూరు: కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వ కూటమి అందిస్తున్న ఏకపక్ష విధానంలో భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. మండలంలోని గోవిందాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుడారు. ఈనెల 28న దేశ రాజధాని ఢిల్లీలో అఖిలభారత సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెరుమాండ్ల యాకయ్య, రంగయ్య, గంగంరాజు పాల్గొన్నారు.

నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్: కొత్తగా నిర్మిస్తున్న మూడో రైల్వేలైనుకు నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైల్వే నిర్మాణపనుల పర్యవేక్షణలో భాగంగా మానుకోటకు వచ్చిన రైల్వే కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గంటా శ్రీనివాస్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోమారపు వీరస్వామి, రైల్వే అధికారులు కోడారి రాధాకృష్ణ, రణధీర్ ఉన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన దివ్యాంగుడైన ఉద్యోగిపై దాడిచేసిన హెచ్‌ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోతు రవి అన్నారు. జిల్లా కేంద్రంలో గిరిజన శాఖ అధికారి గుగులోతు దేశీరాంనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, నాయకులు అశోక్, వికాస్, హర్షవర్ధన్, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగులకు పారితోషికం చెల్లించాలని వినతి

కేసముద్రం: సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించిన ఎన్యూమరేటర్‌లకు, డేటా ఎంట్రీ చేసిన ఆపరేటర్‌లకు పారితోషికం వెంటనే చెల్లించాలంటూ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో క్రాంతికి, పలువురు ఉద్యోగులు, ఆపరేటర్లు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్, భిక్షపతి, ఉపేందర్, వెంకటరమణ, మురళి, స్వాతి, నాగవాణి పాల్గొన్నారు.

ముగిసిన బాలకుమారస్వామి జాతర

గంగారం: మండలంలోని చుంచ వారి ఇలవేల్పు బాల కుమారుడి జాతర సోమవారంతో ముగిసింది. మూడురోజులుగా నిర్వహించిన బాల కుమారస్వామి జాతర సోమవారం ముగియడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4గంటలకు బాలకుమారస్వామిని వన ప్రవేశం చేశారు. జాతరను పురస్కరించుకొని వాలీబాల్ క్రీడలను నిర్వహించారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

కురవి: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తమ సామాజికవర్గానికే ఓట్లు వేసుకోవాలని హిందూబీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని సూదనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. టీచర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తమ వారినే గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, ప్రదీప్, ప్రగతి, సారంగం, శుభ, అంజద్‌పాషా, సరోజ, బాలరాజు, పరికిపండ్ల అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


చిన్నగూడూరు: ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నూతన సబ్‌స్టేషన్లు మంజూరు

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చొరవతో నూతనంగా సబ్‌స్టేషన్లు మంజూరు అయినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపాడు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు చల్ల నారాయణరెడ్డి, మొగిళి, రణధీర్, ఇర్ప రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

దంతాలపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వేములపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టపల్లి వెంకన్న(55) రెండు సంవత్సరాల క్రితం రూ.8లక్షలు అప్పుచేసి గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నాడు. అలాగే తన కుమారుడి చదువు కోసం కొంత అప్పు చేశాడు. ప్రతి సంవత్సరం అప్పు పెరగడంతో, ఎలా తీర్చాలో తెలియక మానసిక ఆవేదనకు గురయ్యాడు. ఈక్రమంలోనే సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో తన వ్యవసాయం కోసం తీసుకువచ్చిన పురుగుల మందును ఉదయం 10గంటల సమయంలో తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య మట్టపల్లి ఉప్పలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

షార్ట్ సర్క్యూట్‌తో మహిళ మృతి

నర్సింహులపేట: మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన ముదిరెట్టి శైలజ(30)విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎస్సై మాలోతు సురేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి విద్యుత్‌తో నడిచే పిండి, కారం మిల్లు శుభ్రం చేస్తుండగా పట్టా కప్పుతున్న సమయంలో శైలజకు ప్రమాదవశాత్తు షాక్ వచ్చింది. వెంటనే గమనించిన తల్లి జయమ్మ ఇంటి పక్కన వారి సహాయంతో 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చేందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. సోమవారం తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోన్ పోయిన కాసేపటికి డబ్బులు మాయం

మహబూబాబాద్ రూరల్: ఓ వ్యక్తికి చెందిన సెల్ ఫోన్ మాయమవగా కొంత సమయానికి అందులో ఉన్న రూ.78,500 నగదును సైబర్ మోసగాళ్లు మాయం చేసిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు తమకు తెలిసిన వారి కిరాణం షాపులో సామగ్రి కొనుగోలు చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో యువకుడి సెల్‌ఫోన్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సెల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు చేద్దామని అనుకుంటూ.. తనకు డబ్బులు అవసరం ఉండగా డ్రా చేసుకునేందుకుగాను బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో డబ్బులు ఎంత ఉన్నాయని విచారిస్తుండగా తన ఖాతాలోనుంచి రూ.78,500 మాయమైనట్లు బాధితుడు గుర్తించాడు. సైబర్ మోసగాళ్లు తన ఫోన్‌లో నుంచి డబ్బులు మాయం చేశారని తెలుసుకున్న సదరు యువకుడు వెంటనే సైబర్ క్రైం నంబర్ 1930లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు అందజేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మేస్త్రీ మృతి

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ సుతారి మేస్త్రీ మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని మిర్త్రీ కాలనీకి చెందిన సుతారి మేస్త్రీ బూర్గుల మల్లయ్య రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉండే గులగట్టు శ్రీనివాస్, గులగట్టు స్వరూప ఇళ్లలో పలు నిర్మాణ పనులు ఉండగా ఈనెల 10న వెళ్లాడు. ఇంటి పైకప్పు వద్ద ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు సుతారి మేస్త్రీ మల్లయ్యకు తగిలాయి. దీంతో ఆయన తలకు, శరీరంపై తీవ్ర గాయాలై అక్కడే పడిపోగా స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య రమ మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ దామోదర్ శవ పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.